వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో వెల్లువెత్తిన ఉత్సాహం

- 'పురం' పార్లమెంట్ సమన్వయకర్త శాంత, పెనుకొండ సమన్వయకర్త, మంత్రి ఉషశ్రీచరణ్‌కు ఘన స్వాగతం
- మిన్నంటిన జై జగన్ నినాదాలు



సూగురు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శాంత



అమ్మవారిపల్లి వద్ద పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మంత్రి ఉషశ్రీచరణ్

హిందూపురం/పెనుకొండ రూరల్: హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త జె.శాంత, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మంత్రి ఉషశ్రీచరణ్ రాకతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. సమన్వయకర్తలుగా నియమితులైన తర్వాత జె.శాంత, ఉషశ్రీచరణ్‌లు శనివారం తొలిసారిగా తమతమ నియోజకవర్గాలకు విచ్చేశారు. హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలనుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు వందలాది వాహనాల్లో తరలివచ్చి సమన్వయకర్తలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జై జగన్ అంటూ కార్యకర్తలు నినదించారు. జె.శాంత హిందూపురం విచ్చేసి నేరుగా సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోయపేటలోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు అర్పించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు సమర్పించారు. అనంతరం హిందూపురం నియోజకవర్గ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. శాంతకు హిందూపురం నియోజవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక, నియోజకవర్గ నాయకులు వేణురెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మలు పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించారు. శాంత మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: పెనుకొండ సమన్వయకర్త, రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఉషా శ్రీ చరణ్‌కు వైఎస్సార్‌సీపీ శ్రేణుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు భారీ సంఖ్యలో వాహనాల్లో పెనుకొండ 44వ జాతీయ రహదారిలోని అమ్మవారిపల్లి వద్దకు చేరుకున్నారు. అక్కడకు చేరుకున్న మంత్రి ఉషశ్రీ చరణ్‌తో కలిసి భారీ కాన్వాయ్‌తో ర్యాలీగా బయలుదేరి పెద్ద చెరువు కట్ట ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయంలో పూజల అనంతరం ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మెన్ పొగాకు రామచంద్ర, ఎంపీపీ గీత, జెడ్పీటీసీ శ్రీరాములు, నాయకులు సుధాకర్ రెడ్డి, వైశాలి జయశంకర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగభూరు బాబు, సింగిల్‌విండో అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రెడ్డి, కర్రా సంజీవరెడ్డి, గంపల రమణారెడ్డిలు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.



రొద్దంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, నాయకులు

రొద్దం: మంత్రి ఉషశ్రీచరణ్‌కు స్వాగతం పలికేందుకు రొద్దం మండలం నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ పద్మ, అక్కులప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు సీ.నారాయణరెడ్డి, ఎన్ నారాయణరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి పాల్గొన్నారు.

గోరంట్ల: శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ రాకను పురస్కరించుకొని గోరంట్ల మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం వందలాది వాహనాల్లో పెద్ద సంఖ్యలో పెనుకొండకు తరలివెళ్లారు.

పరిగి: మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శనివారం పెనుకొండలో జరిగిన మంత్రి ఉషశ్రీ చరణ్ పర్యటనకు భారీగా తరలివెళ్లి ఘనంగా స్వాగతం పలికారు.

క్లుప్తంగా

కంటి అద్దాలు పంపిణీ



కంటి అద్దాలు పంపిణీ చేసిన దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు కంటి వైద్య నిపుణుడు శ్రీనివాస్ శనివారం కంటి పరీక్షలు చేశారు. కంటి దోషాలు ఉన్నవారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ గోపాల్ పాల్గొన్నారు.

9న 'జగనన్న ఆరోగ్య సురక్ష'

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఈనెల 9న రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అంజినమ్మ తెలిపారు. డాక్టర్లు వివిధ రకాల వైద్య పరీక్షలు, చికిత్సలు చేసి ఉచితంగా మందులను అందిస్తారన్నారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆంగ్ల విద్య ఎంతో ప్రయోజనకరం



విద్యార్థికి మెమెంటో అందజేస్తున్న సబ్‌జైల్ సూపరింటెండెంట్

పెనుకొండ: ఆంగ్లవిద్య ఎంతో ప్రయోజనకరమని ఎంఈఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోని శాంతినికేతన్ ఆంగ్లమాధ్యమ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన పాఠశాల 45వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆంగ్ల బోధనలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో ఇక్కడి విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల నిర్వాహకులు శ్రీకాంత్‌రెడ్డి, ఎంఈఓ-2 సుధాకర్, సబ్‌జైల్ సూపరింటెండెంట్ అజిగర్ హుస్సేన్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' కిట్ల పంపిణీ



టీషర్టులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో ఈ నెల 10న జరిగే మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎంపీడీఓ మునిస్వామి శనివారం క్రీడా కిట్లను ఎంపీడీఓ కార్యాలయంలో పంపిణీ చేశారు. క్రీడాకారులు ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను ధరించి పోటీల్లో పాల్గొనాలన్నారు. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు.

వేలం వాయిదా

హిందూపురం: స్థానిక పరిగి బస్టాండులో ఖాళీస్థలంలో ఏర్పాటుచేసిన షాపులకు నిర్వహించాల్సిన బహిరంగ వేలం పాట వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ శనివారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పరిగి బస్టాండ్‌లో ఉన్న వాణిజ్యభవనాల నిర్వాహణకు వేలాలు యథావిధిగా వేలం నిర్వహిస్తున్నామన్నారు. అయితే ఖాళీ స్థలాల్లో ఏర్పాటైన షెడ్ షాపుల బహిరంగ వేలం రద్దు చేసినట్లు తెలిపారు. అద్దె ఎక్కువగా ఉందని వ్యాపారులు పేర్కొన్నారని, దీనిపై పునః పరిశీలన చేసి షెడ్లకు సంబంధించిన షాపుల బహిరంగ వేలం ప్రకటిస్తామన్నారు.

తగాదాలతో జైలుపాలు కావద్దు



జైలులో సదుపాయాలపై ఆరా తీస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

హిందూపురం అర్బన్: చిన్న చిన్న విషయాలకు గొడవలు చేసుకొని జైలుకు వచ్చి ఇబ్బందులు పడవద్దని సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ ఖైదీలకు హితబోధ చేశారు. శనివారం ఆయన పట్టణంలోని సబ్‌జైలును తనిఖీ చేశారు. వంటగది, శుద్ధజలప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. ఏయే కేసుల్లో జైలుకు వచ్చారనే విషయాలపై ఆరా తీశారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకున్నారా అని వాకబు చేశారు. జైళ్లకు పదే పదే రావడం వల్ల ఆర్థిక భారం పడటంతో పాటు కుటుంబ గౌరవం కూడా దెబ్బతింటుందని, ప్రశాంత జీవితం సాగించాలన్నారు. కార్యక్రమంలో జైలు అధికారి అంజినాయక్, న్యాయవాదులు జ్ఞానేష్ నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు



వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న జె.శాంత

పరిగి: మండలంలోని కాలువపల్లిలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాల మధ్య వేద పండితులు వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు నిర్వహించారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ సాకమ్మ, హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, స్థానిక ఎంపీటీసీ చిక్కన్న, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అడ్వైజర్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ వన్నేరువప్ప, మాజీ ఎంపీటీసీ అంజి, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ జయరాం, నాయకులు గిరి, లక్ష్మీనారాయణ, పద్మావతి పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. రామాయణ మహాకావ్యాన్ని రచించిన వాల్మీకి మహర్షిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పరిగి: హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శాంత శనివారం సాయంత్రం కాలువపల్లికి విచ్చేశారు. గ్రామంలో ప్రతిష్ఠించిన వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు చేశారు. అంతకుముందు ఆమెకు వాల్మీకి సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. నాయకులు గిరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో నిఘా పెంచాలి

- పోలీసులకు ఎస్పీ మాధవరెడ్డి ఆదేశం



లేపాక్షి స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

లేపాక్షి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, సరిహద్దు ప్రాంతాల్లో నిఘా మరింత పెంచాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. శనివారం ఉదయం ఆయన లేపాక్షి, హిందూపురం రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులతో పాటు రిసెప్షన్, లాకప్, కంప్యూటర్ గది, రైటర్ గదులను పరిశీలించారు. ఆయా స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తు తీరు గురించి సిబ్బందితో ఆరా తీశారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమయ్యారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా నడుచుకోవాలని, న్యాయపరమైన సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామ స్థాయిలో పరిస్థితులను లోతుగా అధ్యయనం చేయాలన్నారు. సమస్యలు ఉత్పన్నం కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని, సాంకేతిక అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం మహిళా పోలీసులతో మాట్లాడుతూ, మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తరచూ గ్రామాలను సందర్శిస్తూ సైబర్ నేరాలు, దిశ యాప్ వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, చోరీల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఎస్పీ వెంట హిందూపురం డీఎస్పీ కంజాక్షన్, సీఐ వేణుగోపాల్, సీసీ రాఘవేంద్ర, ఎస్ఐ గోపి, మహిళా పోలీసులు, సిబ్బంది ఉన్నారు.

స్కూళ్లను బలోపేతం చేయండి

రొళ్ల: ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకొని ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల అభివృద్ధి (సూక్ష్మ ప్రణాళిక తయారి)పై ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నాడు-నేడు కింద పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. పిల్లల చదువు పట్ల ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. తర్వాత కొన్ని పాఠశాలల్లో నెలకొన్న ప్రధాన సమస్యలపై చర్చించారు. అనంతరం గుడ్డగుర్కి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.

మా మద్దతు జగనన్నకే



మడకశిర మండలం సీ కొడిగేపల్లిలో ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం



రొళ్ల మండలం హొట్టేబెట్టలో వైఎస్సార్ పింఛన్ కానుక పోస్టర్లను ప్రదర్శిస్తున్న సర్పంచ్

మడకశిర రూరల్: వృద్ధాప్యంలో ఉన్న తమకు అండగా నిలిచిన జగనన్నకే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఉంటుందని అవ్వాతాతలు పేర్కొన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా రూ.3వేల పింఛన్ అందజేస్తున్న జగనన్నకు జేజేలు పలికారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పింఛన్ల పంపిణీ చేపట్టారు. లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు రూ.3 వేల పింఛన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంటివద్దకు వచ్చి పింఛన్లు అందజేయలేదన్నారు. జగనన్న సీఎం అయ్యాక ప్రతినెల ఒకటో తేదీనే సూర్యోదయం కాకముందే వలంటీర్లు ఇంటి తలుపు తట్టి పింఛన్లు అందజేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకే పట్టం కడతామన్నారు.

మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని 17వవార్డు కౌన్సిలర్ సుభద్ర కోరారు.ఆమె శనివారం పట్టణంలోని చాకలికుంటలో వైఎస్సార్ పింఛన్ కానుక కింద రూ.3వేల చొప్పున లబ్ధిదారులకు అందించారు. ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్ పింఛన్లను రూ.3వేలకు పెంచారని తెలిపారు. చంద్రబాబు హయాంలో పింఛన్ తీసుకోవడానికి క్యూలైన్‌లో నిలబడాల్సి ఉండేదని తెలిపారు. ప్రస్తుతం వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇస్తున్నారని తెలిపారు. నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: హొట్టేబెట్ట సచివాలయం ఆవరణలో కొత్తగా మంజూరైన పింఛన్లతో పాటు వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగులకు ప్రభుత్వం పెంచిన రూ.3వేల పింఛన్ మొత్తాన్ని శనివారం సర్పంచ్ ప్రకాష్ అందజేశారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు



క్రీడాకారులతో అధికారులు, పీఈటీలు

గోరంట్ల: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం మహిళా క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. గోరంట్ల 5వ సచివాలయ పరిధిలోని మహిళా జట్టుతో పాటు కమ్మవారిపల్లి సచివాలయ పరిధిలోని జట్లు పోటీ పడ్డాయి. మండలంలోని 20 సచివాలయాల పరిధిలో గ్రామ స్థాయి పోటీలు శనివారంతో ముగిసినట్లు పీడీ రమోహన్ తెలిపారు. ఈనెల 10 నుంచి 20 వరకు బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు మనోహర్, రామచంద్రనాయక్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న వికసిత్ భారత్ జిల్లా కన్వీనర్ మేడికుర్తి హరి

హిందూపురం టౌన్: అన్ని వర్గాలకు సంక్షేమంతోనే దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా కన్వీనర్ మేడికుర్తి హరి, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 36వ వార్డు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత, రైతులు, మహిళలు, పేదలను అభివృద్ధిలోకి తీసుకువస్తే దేశం అభివృద్ధి దిశగా పురోగమిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ వెంకటరమణ, హౌసింగ్ ఏఈ నారాయణరెడ్డి, బీజేపీ నాయకులు భాగ్యమ్మ, నాగేంద్ర, నర్మద, శివజ్యోతి, వరలక్ష్మి, సాధిక్, రవితేజారెడ్డి, నగేష్, మోహన్ పాల్గొన్నారు.

వృద్ధులకు ప్రేమానురాగాలు పంచాలి

- అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

పరిగి: వృద్ధులకు ప్రేమానురాగాలు పంచాలని అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ సూచించారు. మండల పరిధిలోని సేవామందిరంలోని ప్రశాంతి మందిరం వృద్ధాశ్రమంలో శనివారం సీనియర్ సిటిజన్స్ అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలో తల్లిదండ్రుల పట్ల ప్రేమానురాగాలు సన్నగిల్లిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుమారులు, కుమార్తెలు తల్లిదండ్రుల పట్ల బాధ్యతగా మెలిగి వారి ఆలనా పాలనా చూడాలని సూచించారు. నిరాదరణకు గురైన వృద్ధులు అర్జీ పెట్టుకొని న్యాయం పొందవచ్చన్నారు. ఇందు కోసం వారికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. పిల్లలు అక్రమంగా ఆస్తులు పొంది ఆలనా పాలనా చూడకపోతే అటువంటి తల్లిదండ్రులు తిరిగి ఆస్తులు పొందే అవకాశం ఉంటుందన్నారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు వలసల పంచమి ముక్తి, న్యాయవాదులు కళావతి, పార్వతి, సంతోషికుమారి, వన్నేరువప్ప, సవేరా, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోపు క్లైయిములు అందించండి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అపూర్వభరత్

పెనుకొండ: ఓటరు జాబితాకు సంబంధించి ఫారం-6, ఫారం-7, ఫారం- 8కి సంబంధించి క్లైయిములు ఉంటే గడువులోపు ఎన్నికల కార్యాలయంలో అందజేయాలని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశపు భవనంలో శనివారం ఆయన నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయిలో ఇబ్బందులు ఉన్నా, మౌలిక సదుపాయాలు లేకపోయాయని, వెంటనే కార్యాలయంలో తెలియజేయాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించండి

రొళ్ల: రాష్ట్రంలో త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేసిన పాఠశాల ఆవరణలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు ఉండేలా ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమై పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పనపై సమీక్షించారు. రొళ్ల మండలంలో (100 నుంచి 132 పోలింగ్ స్టేషన్లు) 32 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేసిన ఎం.రాయాపురం ఉన్నత, ప్రాథమిక పాఠశాల, అగ్రహారం, మల్లసముద్రం, గుడ్డగుర్కి, బీజీ హళ్లి, దాసప్పపాళ్యం, హులిసేకుంట ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రాల్లో పలు సమస్యలు ఉన్నట్లు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, డీఈఓ మీనాక్షి ఆదేశాల మేరకు ఈ నెల 8లోపు ఆయా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, నీరు, వెలుతురు తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

భక్తిశ్రద్ధలతో 'ఇరుముడి'



శబరిమలైకు బయల్దేరుతున్న అయ్యప్ప మాలధారులు

గుడిబండ: మండల కేంద్రంలో శనివారం అయ్యప్ప మాలాధారుల ఇరుముడి మహోత్సవం నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో ఘనంగా జరిగింది. 41 రోజుల పాటు ఎంతో కఠిన నియమాలతో దీక్ష చేపట్టిన భక్తులు ఇరుముడి ధరించి శబరిమలై యాత్రకు బయల్దేరి వెళ్లారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం



అలంకరణలో సీతారాములు

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం గ్రామంలో గోందావళి సద్గురు బ్రహ్మచైతన్య స్వామి ఆరాధనోత్సవంలో భాగంగా శనివారం శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం వేదపండితులు హోమాలు నిర్వహించారు. సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వార్ల మూలవిరాట్‌లను ప్రత్యేకంగా వివిధ పుష్పాలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మెడికో అదృశ్యంపై ఫిర్యాదు



అదృశ్యమైన మెడికో దర్శన్ కుమార్

పావగడ: పట్టణంలోని ధర్మవరం లేఔట్‌లో నివాసముంటున్న వైద్య విద్యార్థి 22 ఏళ్ల సి దర్శన్ కుమార్ అదృశ్యమైనట్లు అతని తల్లి శ్రీలక్ష్మి ఫిర్యాదు చేసినట్లు పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గురునాథ్ శనివారం తెలిపారు. విద్యార్థి తండ్రి బాబు ప్రసాద్ ఇటీవల మృతి చెందాడని, తల్లి శ్రీలక్ష్మి తన కుమారుడిని దావణగెరె వైద్య శాలలో మెడిసిన్ కోర్సులో చేర్పించిందన్నారు. ఎక్కువగా చదవడంతో మానసిక ఒత్తిడికి గురై ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా ఉండేవాడని, శివమొగ్గలోని మానస ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఏడాదిగా ఇంట్లోనే ఉండేవాడన్నారు. గత నెల 28న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని అతని తల్లి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. నారాయణ కళాశాల లోగో నీలి రంగు స్వెటర్, తెల్లని చారలున్న నీలి రంగు షర్టు, సిమెంట్ రంగు ప్యాంట్ ధరించినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ 9480802977 మొబైల్ నంబరుకు సమాచారం అందివ్వాలని ఎస్ఐ గురునాథ్ కోరారు.

సచివాలయాల సేవలు అమోఘం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

హిందూపురం: గ్రామ, వార్డు సచివాలయ దివ్యాంగ ఎంప్లాయీస్ అసోసియేషన్ రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌చే శనివారం ఆవిష్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ప్రభుత్వ పాలనలో ముఖ్య భూమిక పోషిస్తోందన్నారు. ప్రజల ముంగిటికే పథకాలను తీసుకెళ్లి విశేష సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థ, మున్సిపల్ జేఏసీ అధ్యక్షుడు బండి ఆనందరాజు, జనరల్ సెక్రెటరీ రామాంజనేయులు, జేఎస్‌డబ్ల్యూఎస్ 13/2020 రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సిరాల చంద్ర, జిల్లా అధ్యక్షుడు జయప్రసాద్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ శరణ్, హిందూపురం అర్బన్ ప్రెసిడెంట్ హరినాథ్, శ్రీకాంత్, సుధాకర్, మనోహర్, రాము, లోకేష్, హరీష్ పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి చేయండి

అమరాపురం: గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులు ఐకమత్యంతో సంఘాల బలోపేతానికి కృషి చేయాలని మడకశిర నియోజకవర్గ ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు సూచించారు. ఆలదపల్లి గ్రామంలో శనివారం గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘాలు సక్రమంగా పని చేస్తే రుణాలను విరివిగా మంజూరు చేస్తామన్నారు. అదేవిధంగా తీసుకున్న రుణాలను వాయిదాల ప్రకారం చెల్లించాలన్నారు. ఏపీ పథకం ద్వారా రుణాలు ఇస్తామో తెలియజేశారు. సీ గ్రేడులోని సంఘాలు ఏ గ్రేడులోకి రావాలన్నారు. తక్కువ వడ్డీతో రుణాలు పొంది చిన్న చిన్న వ్యాపారాలు, పాడి పరిశ్రమ ఏర్పాటు చేసుకుంటే మంచి ఆదాయం పొందవచ్చన్నారు. సంఘాల సభ్యులు సీసీ, వీఓఏలు పాల్గొన్నారు.